ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 7 జనవరి 2024 | 5



నాడు అలా.. నేడు ఇలా..

- పండుగ వేళ కార్డుదారులకు షాక్
- రేషన్ సరుకుల్లో కోత
- 42శాతం కార్డులకే కందిపప్పు
- గోధుమ పిండి, పంచదార అరకొరగానే...
- టీడీపీ హయాంలో పండుగల్లో కానుకల పేరిట ఉచితంగా నిత్యావసరాలు



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సంక్రాంతి కానుక(ఫైల్‌ఫొటో)

పిఠాపురం, జనవరి 6: సంక్రాంతి పండుగ వేళ రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. కార్డులపై పంపిణీ చేసే సరుకుల్లో కోత విధించింది. సగం మందికి కూడా కందిపప్పు, గోధుమపిండి అందని పరిస్థితి కల్పించింది. పంచదార కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. బియ్యం మినహా ఏ సరుకులు నేడు అందకపోవడంతో రేషన్‌కార్డుదారులు గతంలో పండుగ సమయాల్లో కానుకల పేరిట టీడీపీ ప్రభుత్వం ఉచితంగా నిత్యావసర సరుకులు అందించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. నాడు అలా.. నేడు ఇలా ఉంది అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. సంక్రాంతి పండుగ వస్తున్న తరుణంలో అదనపు కోటా ఇస్తారని భావిస్తే అసలు ఇచ్చే సరుకుల్లోనే వైసీపీ ప్రభుత్వం భారీగా కోత విధించింది. అరకొర కేటాయింపులు జరిపి వాటినే రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాలని ఆదేశించింది. కొంతమందికి ఇచ్చి మిగిలిన వారికి సరుకులు ఇవ్వకపోవడంతో ప్రజలనుంచి ఎండీయూ ఆపరేటర్లకు నిరసనలు తప్పడం లేదు. వారికి సమాధానం చెప్పలేక, ప్రభుత్వం సరుకులు ఇవ్వలేదని చెబుతున్నారు.

కాకినాడ జిల్లాలో 6లక్షల 53వేల 750 రైస్‌కార్డులు ఉన్నాయి. జనవరి నెలకు గాను 9,800టన్నుల బియ్యం కేటాయించారు. సంక్రాంతి పండుగ సమయంలో సాధారణంగా అదనపు కోటా ఇస్తూ ఉంటారు. సాధారణ సమయాల్లో బియ్యం కార్డులకు కిలో కందిపప్పు, కిలో గోధుమపిండి, అరకిలో పంచదార(ఏఏవై కార్డులకు కిలో) ఇస్తున్నారు. పండుగ వేళ అదనంగా కోటా ఇస్తారని భావిస్తే ఇచ్చే కోటాలోనే భారీగా కోతపెట్టారు. 653 టన్నుల కందిపప్పు అవసరం కాగా కేవలం 280టన్నులు మాత్రమే కేటాయించగా, 650 టన్నుల గోధుమపిండికి 328 టన్నులు, పంచదార 350 టన్నులకు 260 టన్నులు మాత్రమే ఇచ్చారు. కందిపప్పు 42శాతం రేషన్‌కార్డుదారులకే కేటాయించగా, గోధుమపిండిది అదే పరిస్థితి.

గత ప్రభుత్వ హయాంలో..

టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగ సమయాల్లో ప్రత్యేకంగా నిత్యావసరాలు అన్నింటినీ ఒక బ్యాగ్‌లో ఉంచి ఉచితంగా అందించేది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రజలంతా ఆనందంగా పండుగ జరుపుకోవాలనే లక్ష్యంగా రంజాన్ తోఫా, సంక్రాంతి, క్రిస్మస్ కానుకల పేరిట బెల్లం, నెయ్యి, వంట నూనె, కందిపప్పు, గోధుమపిండి తదితర సరుకులను కార్డుదారులకు ఉచితంగా అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తోఫా, కానుకల పంపిణీని రద్దుల పద్దులో చేర్చింది. కనీసం కార్డుదారులకు ఇచ్చే నిత్యావసర సరుకులను పూర్తిగా ఇవ్వకుండా పండుగ సమయాల్లో కోతలు పెడుతుండడంతో ప్రజలు గత ప్రభుత్వ హయాంలో ఉచితంగా అందిన సరుకులు గురించి గుర్తు చేసుకుంటున్నారు. నాడు పండుగ వేళ సరుకులు అన్నీ ఉచితంగా అందేవని, ఇప్పుడు కనీసం డబ్బులకు కూడా కొందామన్నా ఇవ్వడం లేదని కార్డుదారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో పండుగను ఆనందంగా ఎలా జరుపుకోగలమని వారు ప్రశ్నిస్తున్నారు.

ఏడునెలలుగా ఊరించి...

బియ్యం కార్డుదారులకు కందిపప్పును ప్రతినెలా అందించాల్సి ఉండగా ఏడు నెలలపాటు సరఫరా నిలిచిపోయింది. నవంబరు నెలలో 50శాతం కార్డులకు మాత్రమే కేటాయింపులు జరపడంతో ఆ నెలలో సరఫరా నిలిపివేసి డిసెంబరు నెలలో కోటాతో కలిపి అన్నికార్డులకు ఇవ్వాలని భావించినా సాధ్యపడలేదు. చివరకు నవంబరు నెలలో వచ్చిన కోటానే సరఫరా చేశారు. సంక్రాంతి సమయంలో నూరుశాతం కార్డులకు వస్తుందని భావించినా గతంలో కంటే తక్కువగా కేటాయింపులు జరిపారు. పండుగ వేళ ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల్లో కొందరికే కందిపప్పు అందించడం వివాదాలకు దారితీస్తోంది. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200 వరకూ ఉంది. అదే కార్డుదారులకు కిలో రూ.67కు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా ప్రతినెలా కందిపప్పు అందించేవారు. ప్రభుత్వం అదనపు భారం మోసేందుకు వెనుకంజ వేయడం, చెల్లింపుల్లో జాప్యంతో కందిపప్పు అందని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. గోధుమపిండిని 50శాతం కార్డులకే కేటాయించడం, పంచదార కేటాయింపుల్లో కోత పెట్టడంతో సరుకులు పంపిణీ ఎలా పూర్తి చేయాలో తెలియక ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సరుకులు తాము ఇవ్వడం లేదని కార్డుదారులు భావిస్తున్నారని వారు తెలిపారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో.. నేడు కాకినాడలో ముత్యాల ముగ్గుల పోటీలు

కాకినాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి):కాకినాడ పట్టణంలోని పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లరిన్ హైస్కూల్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈనెల 7న ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా కాకినాడకు చెందిన సానా సతీష్ ఫౌండేషన్ వ్యవహరిస్తోంది. ఉదయం 9గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలలనుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 9949485803, 9985411207, 9985411260నెంబర్లను సంప్రదించగలరు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు ఆదివారం నేరుగా అక్కడకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

బస్సు యాత్ర తుస్

- పెద్దాపురంలో వైసీపీ సాధికార బస్సు యాత్ర ఫ్లాప్
- సభ ఆరంభంలోనే వెనుదిరిగిన మహిళలు
- ఖాళీ కుర్చీలకే నాయకుల ఉపన్యాసం
- నల్లబెలూన్లతో అంగన్‌వాడీల నిరసన



ప్రజలు లేక ఖాళీగా ఉన్న వైసీపీ సాధికార యాత్ర సభా ప్రాంగణం

పెద్దాపురం, జనవరి 6: పెద్దాపురంలో వైసీపీ బస్సు యాత్ర వెలవెలబోయింది. ఆర్భాటమే తప్ప అనుకున్న స్థాయిలో సభ ప్రజలను ఆకట్టుకోలేకపోయింది. డ్వాక్రా సంఘాల ద్వారా పథకాలు కట్ చేస్తామని మహిళలను బెదిరించి తరలించినా సభ జరుగుతుండగానే మధ్యలోనే వెనుతిరిగారు. దీంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. పెద్దాపురం పట్టణంలో వైసీపీ నాయకులు నిర్వహించిన వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర తుస్సుమంది. సాయంత్రం 4 గంటలకు మొదలైన బహిరంగసభ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు వైసీపీ నేతలు వంగా గీతావిశ్వనాథ్, నందిగం సురేష్, కురసాల కన్నబాబు, జూపూడి ప్రభాకరరావు, అదీప్‌రాజు, మోషేన్ రాజు సహా పలువురు హాజరయ్యారు. వారు బహిరంగ సభలో ప్రసంగిస్తుండగానే మహిళలు వెళ్లిపోయారు. ఆటోల్లో జనాన్ని వేదిక వద్దకు తరలించినా మండలాల నేతలు ఎంత ప్రయత్నించినా 2వేలకు మించి జనం రాలేదు. నాయకుల ప్రసంగాలు ప్రారంభం కాగానే వెళ్లిపోయే వారి సంఖ్య పెరిగింది. వైసీపీ సాధికార బస్సు యాత్రకు వచ్చిన నాయకులకు అంగన్‌వాడీలు నల్లబెలూన్లతో నిరసన తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సభనుంచి వెళ్లిపోయేవారిని ఆపేందుకు వైసీపీ నాయకులు, పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి ప్రయత్నం చేశారు. కొంతమంది వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగడంతో మహిళలు తిరగబడ్డారు. దీంతో చేసేదిలేక బారికేడ్లు తొలగించి వారిని బయటకు పంపేశారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలను గాలికొదిలేసి కేవలం వైసీపీ సాధికార బస్సు యాత్ర ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన నాయకులను విమర్శించడమే పనిగా పెటుకున్నట్లు కనిపించింది. సామాజిక సాధికార బస్సు యాత్ర పెద్దాపురం మున్సిపల్ జంక్షన్‌వద్ద నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ ప్రాంతంలోని దుకాణాలను వైసీపీ నాయకులు మూయించడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు విమర్శించారు.

డిమాండ్లు నెరవేర్చాలని పారిశుధ్య కార్మికుల నిరసన



కాకినాడ కార్పొరేషన్ వద్ద సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 6: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం శారదాదేవి గుడివద్ద ఉన్న నగరపాలకసంస్థ కార్యాలయంవద్ద సమ్మె కొనసాగించారు. ఈ సమ్మెకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పెదిరెడ్డి సత్యనారాయణ హాజరయ్యారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఒంటి కాలితో నిరసన చేస్తూ మమ్మల్ని పర్మినెంట్ చేయండి మహాప్రభో, జీతాలు పెంచండి మహాప్రభో, పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంనుంచి ర్యాలీగా శారదాదేవిగుడి, జిల్లా లేబర్ కార్యాలయం, జీపీటీ రోడ్డు మీదుగా వచ్చి మున్సిపల్ కార్యాలయంవద్దకు చేరుకుని సమ్మె చేపట్టారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిశీలించకుండా ప్రత్యామ్నాయ పనులకు ఆదేశాలు ఇస్తే పనులు అడ్డుకుంటామన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరసనలు మానుకోవాలని బెదిరింపులకు పాల్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, 14 సర్కిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

10న తునిలో 'రా.. కదలి రా..'

- సభ ఏర్పాట్లపై టీడీపీ, జనసేన నేతల చర్చ

కాకినాడ సిటీ, జనవరి 6: ఈనెల 10న తునిలో లక్షమందితో నిర్వహించనున్న టీడీపీ రా.. కదలిరా.. చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లపై నేతలు చర్చించారు. ఈ మేరకు కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. టీడీపీ-జనసేన కార్యాచరణతో నిర్వహించే ఈ సభకు లక్షమందికిపైగా జనసమీకరణ జరిగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 5వేల మందిని తరలించాలని, సభను విజయవంతం చేసేందుకు ఆదివారం ప్రతి నియోజకవర్గంలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. జిల్లా అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలని, రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదలి రావాలనే నినాదంతో రా కదలి రా సభ నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ కాకినాడ, కోనసీమ జిల్లాల సమన్వయకర్త బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, పార్టీ నేతలు బూరుగుపల్లి శేషారావు, జ్యోతుల నెహ్రూ, గొల్లపల్లి సూర్యారావు, చిక్కాల రామచంద్రరావు, గన్నికృష్ణ, వనమాడి కొండబాబు, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, పిల్లి అనంతలక్ష్మి, అయితాబత్తుల ఆనందరావు, మందలపు రవి, గుణ్ణం చంద్రమౌళి, మహాసేన రాజేష్, వరుపుల సత్యప్రభ, కటకంశెట్టి బాబి, వంగలపూడి అనిత, జనసేన నేతలు పంతం నానాజీ, వరుపుల తమ్మయ్యబాబు, తుమ్మల బాబు, ఇతర నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మీసాల రాజు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, వీవైదాసు, వాసిరెడ్డి చిట్టిబాబు, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు నల్లబెలూన్లతో నిరసన తెలియచేస్తున్న అంగన్‌వాడీలు

సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు



పెద్దాపురం ఆర్‌అండ్‌బీ ఈఈపై పదిమంది మూకుమ్మడి దాడి

కిర్లంపూడి, జనవరి 6: కిర్లంపూడి మండలంలో పెద్దాపురం ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావుపై శనివారం పదిమంది యువకులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ మేరకు ఆయన కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ఈఈ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం రాజుపాలెంనుంచి రామవరం వరకు వెళ్లే ప్రధాన రహదారి పనులు నిర్వహిస్తున్నారు. రాజుపాలెం ప్రధాన రహదారి కొలతలు కొలుస్తుండగా స్థానిక యువకులు కొందరు వచ్చి ఈ రోడ్డు పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య ఘర్షణ జరిగిందని, తనను కొడుతూ అందులో ఒకరు వీడియో తీశారని ఆయన ఆరోపించారు. తన వెంట ఉన్న వ్యక్తివద్ద ఫోన్ లాక్కున్నారన్నారు. దీంతో ఇరువురు కలిసి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది.

అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరుకావాలి: పీడీ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 6: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అందరూ విధులకు హాజరుకావాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల కోరారు.

కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 6: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు సిటీ నియోజకవర్గ ఈఆర్వో, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులతో కలిసి శనివారం కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. జేఎన్‌టీయూ కళాశాలలోని క్యాంపస్‌ను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లతోపాటు కౌంటింగ్ నిర్వహించే కేంద్రాలను కూడా పరిశీలించి కలెక్టర్‌కు నివేదించారు. ఆయన వెంట కాకినాడ, పిఠాపురం తహశీల్దార్లు సీతాపతిరావు, త్రినాథరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, మురళీకృష్ణ, కృష్ణ ఉన్నారు.

రాజమహేంద్రవరంలో ఘనంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి
ముత్యాల ముగ్గులపోటీలు


బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు సమీపంలోని షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఆదిరెడ్డి భవాని చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అధ్యక్షత వహించగా, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి శ్రీవిద్య, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే కన్సొలేషన్ బహుమతులు మరో 12 మంది మహిళలకు అందజేయగా, పాల్గొన్న అందరికీ గిఫ్టులను అందించారు.


రాజమహేంద్రవరంలో షిర్డీసాయి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

అలరించిన తెలుగు తోరణం

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలల ప్రాంగణంలో గైట్ విద్యార్థులు శనివారం రాత్రి ప్రదర్శించిన తెలుగు తోరణం నృత్యం రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన అద్భుతమైన ప్రదర్శనలు అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. తెలుగు జాతి ఔన్నత్యం, తెలుగు వారి గొప్పతనాన్ని చాటిచెప్తూ మహనీయులందరినీ స్మరిస్తూ తెలుగు తోరణం నృత్య ప్రదర్శన సాగింది. విద్యార్థులు, ప్రేక్షకులు ఉరకలేసే ఉత్సాహంతో కేరింతలు కొడుతూ ఉర్రూతలూగారు. ఆదికవి నన్నయ మొదలుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగువారి పాత్ర స్వాతంత్ర్యం అనంతరం వివిధ పదవులతో కీర్తి తెచ్చిన తెలుగువారు, తమ కృతులు, కీర్తనలతో ఖ్యాతి తెచ్చిన త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు తదితరులతో పాటు సాహిత్యంలో కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన మహనీయులు, రంగస్థల నటులు, హరికథలు, బుర్రకథలతో ఖ్యాతిగాంచినవారు, సినీ నటులు, రచయితలు, శ్రీకృష్ణదేవరాయల కొలువు అన్ని కోణాలను, అన్ని రంగాల్లో వన్నె తెచ్చిన తెలుగువారిని స్పృశిస్తూ వారి గురించి వివరిస్తూ సాగిన ఈరూపకం అందరినీ కట్టిపడేసింది. సినీ రచయిత రసరాజు రచించిన ఈ నృత్య రూపకానికి ఘంటసాల పవన్‌కుమార్ నృత్య దర్శకత్వం వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ ప్రదర్శనకు గజల్ శ్రీనివాస్ గానం, సంగీతం అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ నృత్యాన్ని వీక్షించిన ప్రముఖుల్లో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్

పులకించిన హృదయాలు


నృత్యరూపకం వీక్షిస్తున్న ప్రముఖులు

సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పీఎన్‌బీ హైదరాబాదు జోనల్ మేనేజర్ డీకే శ్రీవాత్సవ తదితరులున్నారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షులు తమ స్థానాల్లో నుంచి లేచి నిలుచుని చేసిన కరతాళ ధ్వనులతో కళాశాల ప్రాంగణం మార్మోగిపోయింది.


తెలుగు తోరణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు






ప్రధాన వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనల కోలాహలం

అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 6: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల వేడుకల్లో విద్యార్థులు చేస్తున్న పలు సాంస్కృతిక ప్రదర్శనల్లో తెలుగుదనం ఉట్టిపడుతోంది. కవితా పఠనం, కవి సమ్మేళనాలు, పద్య, గద్య ఆలాపనలతో గైట్ ప్రాంగణం మార్మోగిపోతోంది. రెండో రోజు శనివారం రాజరాజ నరేంద్ర వేదికపై లిటిల్ పారడైజ్ స్కూల్, రవీంద్రభారతి విద్యాలయం, అన్నదేవరపేట ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్‌తోపాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తెలుగు భాష, తెలుగుదనం చాటిచెబుతూ చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపర్చాయి. కార్టూనిస్ట్ శేఖర్ తదితరులు కార్టూన్ల ప్రదర్శన, ప్రధాన ప్రాంగణంలో శిల్పి రాజ్‌కుమార్ వడయార్ ఏర్పాటుచేసిన తెలుగుజాతి కీర్తిని పెంచిన వివిధ రంగాల మహనీయుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే నన్నయ వేదికపై బాలసాహిత్యం, భక్తి సాహిత్యంపై సదస్సులు వినసొంపుగా సాగుతున్నాయి. వెయ్యిమంది కవులు కవితా నీరాజనంలో భాగంగా నారాయణ భట్టు వేదికపై కవితా పఠనం వీనులవిందుగా జరుగుతున్నాయి. పలువురు ప్రముఖులు వేదపండితులు, వేలాదిమంది విద్యార్థుల కోలాహలంతో సందడి నెలకొంది.

ఫిబ్రవరి 16 నుంచి అంతర్వేది ఉత్సవాలు

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, జనవరి 6: రాష్ట్రస్థాయి అంతర్వేదికగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం షెడ్డులో ఏర్పాటుచేసిన వార్షిక ఉత్సవాల మొదటి సమీక్షా సమావేశం అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో శనివారం జరిగింది. తొలుత ఫిబ్రవరి 16నుంచి 25వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లతో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ ప్రతీ భక్తునికి స్వామివారి కల్యాణంతోపాటు దర్శనం చేసుకుని సురక్షితంగా ఆధ్యాత్మిక భావంతో ఇంటికి వెళ్లాలన్నారు. కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవం వంటి ప్రధాన ఘట్టాలపై సమీక్షించారు. అనంతరం డీసీ విజయరామరాజు మాట్లాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా డ్యూటీ కోసం కాకుండా భక్తి సేవా దృక్పథంతో చేయాలని వివిధశాఖల అధికారులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం, దర్శనాలకు భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. రథోత్సవం సమయంలో పోలీసు బందోబస్తుతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు లేకుండా వాహనాలు అడ్డులేకుండా చూడాలన్నారు. చక్రస్నానం, తెప్పోత్సవాలపై ఫిషరీస్ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విద్యుత్ అంత రాయం లేకుండా చూడాలన్నారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్వామివారి కల్యాణోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ పారిశుధ్య చర్యలతోపాటు, వైద్య శిబిరాలు నిర్వహించి స్కౌట్ విద్యార్థులను స్వచ్ఛంద సేవాదళ్ ఏర్పాటుపై మాట్లాడారు. రూ.17కోట్లతో నిర్మితమవుతున్న స్థానిక పంచాయతీ చెరువులో ఈ సంవత్సరం తెప్పోత్సవం నిర్వహించడానికి వీలుండదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలపగా ఆర్డీవో కేశవర్ధనరెడ్డి స్పందిస్తూ అధికారులు, స్థానికులతో


ఉత్సవాల నిర్వహణపై కళ్యాణం మండప ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవోతో పాటు డీసీ విజయరామరాజు, అధికారులు

చివరి ఘట్టమైన తెప్పోత్సవాన్ని ఎలా నిర్వహించాలనేది తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలన్నారు. కొంతమంది వశిష్ఠ గోదావరిపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తే బాగుంటుందని సూచించగా సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ బస్సులు, రోడ్లు, వసతి గదులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ పాటి శివకుమార్, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్‌ఐ ఎస్.రాము, ఎంపీటీసీ భైరా నాగరాజు, చొప్పల బాబూరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఈవో బి.వెంకటేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, తహసీల్దార్ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరిశీలన..

అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆలయ అధికారులతో కలిసి కళ్యాణ ప్రదేశం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలు జరిగే ప్రదేశాలను సందర్శించారు. చక్రస్నానం వద్ద భక్తుల సౌకర్యార్థం జల్లుస్నానం ఏర్పాటుచేయాలని భక్తులు కోరారు. దీనిపై సముద్రం వద్దకు ఆర్డీవో వెళ్లి పరిశీలించారు.


ప్రత్యేక అకర్షణగా నిలిచిన పూలతో అలకరించిన జగ్గు

అన్ని ప్రాంతాలకు ఆదర్శంగా
యానాం ఉత్సవాలు

- అట్టహాసంగా ప్రారంభమైన యానాం ప్రజా ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యానాం, జనవరి 6: యానాం నియోజక వర్గంలో కొన్ని సంవత్సరాలుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యానాం ప్రజాఉత్సవాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పుదుచ్చేరి పర్యాటకశాఖ, యానాం ప్రజలస్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా రు. శనివారం సాయంత్రం స్థానిక పరిపాలనాధికారి మునిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరై ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించి అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 24సంవత్సరాలకు క్రితం యానాం ఫలపుష్ప ప్రదర్శన, 22 సంవత్సరాల క్రితం యానాం ప్రజాఉత్సవాలు ప్రారంభమయ్యాయని, అయితే మధ్యలో రెండుసంవత్సరాలు కరోనా ఇతర కారణాలతో వాయిదా పడటంతో ప్రస్తుతం 22వ ఫలపుష్ప ప్రదర్శన, 20వ యానాం ప్రజాఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. యానాంలో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాకే పుదుచ్చేరి, కారైకాల్, మాహేలో ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించిందన్నారు. యానాం ఉత్సవాల ప్రేరణతోనే కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం బీచ్ ఉత్సవాలు ప్రారంభించారన్నారు. సంక్రాంతి ముందుగానే ఈ ఉత్సవాలతో యానాంలో పండుగ వాతావరణం తీసుకురావాలనే ఉద్దేశంతో స్థానికంగా ఉన్న కళాకారులతోపాటు దేశ, విదేశాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలను ఇస్తున్నారన్నారు. అనంతరం మల్లాడని ఆర్ఎ మునిస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రగాశం, ఎస్పి రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరుకాలేదు.


ప్రజాఉత్సవాలను ప్రారంభిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముందుగా ఈ ఉత్సవాలను పురస్కరించిన శాస్త్రీయ, సిని మా నృత్యపోటీలను నిర్వహించారు. ముఖ్యంగా విశాఖపట్నంకు చెందిన విక్టరీ ఈవెంట్‌మేకర్స్ అధినేత మేడిద విక్టర్ నేతృత్వంలో జబర్దస్త్ ఫేమ్ వినోదిని, రాజమౌళి యాంకరింగ్ అందరినీ ఉత్తేజపరిచింది. ఒడిస్సా సంబల్‌పూరి ఫోక్ డ్యాన్స్, ఫైకా నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

యానాం, జనవరి 6: స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 21 సంవత్సరాలుగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 22వ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైయింది. క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ప్రజాఉత్సవాలకు హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరై ఈ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభించి అనంతరం తిలకించారు. ఈ ప్రదర్శన శనివారం నుంచి సోమవారం వరకూ మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫలపుష్పప్రదర్శనలో స్థానిక వ్యాపార సంస్థలకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

సత్యదేవుడిని దర్శించిన మిజోరం గవర్నర్


మిజోరం గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, జనవరి 6: సత్యదేవుడి తొలిపావంచా వద్ద శనివారం మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు అలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతి రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులు ఉన్నారు.


ప్రమాదంలో కాలి బూడిదైన బోటు


మృతదేహంను వెలికితీసి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

దరియాలతిప్పలో
బోట్లో అగ్నిప్రమాదం

బోటు యజమాని తమ్ముడు సజీవ దహనం

యానాం, జనవరి 6: యానాం శివారు దరియాలతిప్పలోని గోదావరి ఒడ్డున ఉన్న జెట్టిలో మత్స్యకారుల బోటులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకరు సజీవ దహనంకాగా మరొకరు గాయాల పాలయ్యారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన కామాడి నాగేశ్వరరావుకు చెందిన బోట్లో ఐస్, డీజిల్ తరలించే నేపథ్యంలో ఇంజన్ స్టార్ట్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బోటు యజమాని తమ్ముడు కామాడి గంగాద్రి(40) మంటలు ఆర్పేందుకు ప్రయత్నించి ప్రమాదంలో చిక్కుకొని సజీవ దహనమయ్యాడు. యానాం, ఆంధ్రప్రదేశ్, ఓఎన్జీసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసి మృతదేహాన్ని వెలికితీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యానాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బోటు విలువ సుమారు 40లక్షల వరకు నష్టం ఉంటుందని యానాం అగ్నిమాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు.

బోటు ప్రమాదంలో భైరవపాలెం వాసి..


మృతుడు కామాడి గంగాద్రి

ఐ.పోలవరం: యానాం దరియాలతిప్ప బోటు అగ్నిప్రమాదంలో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలేనికి చెందిన కామాడి గంగాద్రి సజీవదహనమయ్యాడు. దరియాలతిప్ప జెట్టీవద్ద బోటుకు మరమ్మతులు చేస్తుండగా మంటలు వ్యాపించడంతో ప్రమాదం జరిగింది. గంగాద్రికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని చనిపోవడంతో అనాథలమయ్యామంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు


ఏలేశ్వరంలో పీడీఎస్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రత్తిపాడు, జనవరి 6: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి 40 బ్యాగుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రెల్లివీధిలో పాత షాపింగ్‌కాంప్లెక్స్‌లో బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించిన సమాచారం మేరకు విజిలెన్స్ రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు చేపట్టారు. 40 బ్యాగులలో సుమారు 2వేల కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. మన్యం రవితేజ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం కిలో రూ.20లు వంతున రేషన్‌కార్డులవద్ద కొనుగోలుచేసి రూ.23లు చొప్పున ఇటుక కార్మికులకు విక్రయిస్తున్నాడు. ఈ బియ్యానికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో రూ.94వేలు గల బియ్యాన్ని, ఎలక్ట్రానిక్ తూకాన్ని సీజ్‌చేసి 6ఏ కింద కేసు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన మన్యం రవితేజపై క్రిమినల్ కేసులు నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ. సురేష్‌బాబు మాట్లాడుతూ తమ పరిధిలోని 3 జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుటామన్నారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగవెంకటరాజు సబ్‌ఇన్‌స్పెక్టర్ జగన్నాధరెడ్డి, ఏలేశ్వరం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్, కానిస్టేబుల్ వల్లి, వీరబాబు పాల్గొన్నారు.

కారును ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు
- కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతా ఆదినారాయణ, సంఘటనాస్థలంలో ఉన్న కారు

గండేపల్లి, జనవరి 6: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రామేశ్వరంపేట ఏడీబీ రోడ్డులో ప్రగతి కాలేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ జగన్నాధపురానికి చెందిన చింతా ఆదినారాయణ (29)మృతి చెందగా, మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం ప్రకారం... చింతా ఆదినారాయణ ఒక మహిళ మోటార్ సైకిల్‌పై పెద్దాపురంవైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా రామేశ్వరంపేట ప్రగతి కాలేజ్ దగ్గరికి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వైపు వస్తున్న కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ముందు వస్తున్న మరో కారుపై పల్టీలు కొట్టి పక్కనే ఉన్న మరోకారుపై పడడంతో ఆదినారాయణ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా వెనుక ఉన్న మహిళకు తీవ్ర గాయాలు కావడంతో వారిని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మహిళ పేరు తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచంలోనే తొలిసారిగా ఫార్మసీ విద్యార్థులకు వర్చువల్ ల్యాబ్ 3డీ

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తొలిసారిగా బీ.ఫార్మసీ విద్యార్థుల కోసం 'వర్చువల్ ల్యాబ్ 3డీ'ని రూపొందించామని యూకే కేంద్రంగా పనిచేస్తున్న ఇన్ఫోప్లస్ టెక్నాలజీస్ డైరెక్టర్ జీవీహెచ్ ప్రసాద్ పేర్కొన్నారు. దివాన్‌చెరువు వీజేస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 'ఫార్మాస్యూటికల్ పరిశోధనల్లో ఇటీవల వృద్ధి, సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. వర్చువల్ ల్యాబ్ 3డీ ద్వారా ఫార్మసీలోని వివిధ అంశాలను, పాఠాలను ప్రదర్శించారు. తమ సంస్థ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల కోసం ఇప్పటికే 13 ఏళ్లుగా త్రీ డైమెన్షనల్ క్లాస్ రూం లెసన్స్‌ని ఆంధ్ర, తెలంగాణతోపాటు 16 రాష్ట్రాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్ సత్కరించారు.



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్

ఎండీయూ వాహనాలను తనిఖీ చేసిన ఆర్డీవో

పెద్దాపురం, జనవరి 6: ఎండీయూల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో ఫిర్యాదులు రాకుండా చూడాలని ఎండీయూల ఆర్డీవో జె.సీతారామారావు సూచించారు. పట్టణంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. కార్డుదారులతో మాట్లాడి సరుకులు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, ఎంఎస్వో విజయకుమారి పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం డప్పులు కొట్టుకుంటున్నారు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జనవరి 6: రాజకీయ వ్యామోహం తప్ప ప్రజా సంక్షేమం పట్టని కొంత మంది నాయకులు నీటి ప్రాజెక్టులు అన్నీ నేనే తెచ్చానని రాజకీయ లబ్ధి కోసం డప్పులు కొట్టుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సుబ్బయమ్మపేటలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఒక నాయకుడు గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నత పదవులు చేపట్టినా నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో పుష్కర ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే పనులు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మిగతా పనులు పూర్తి చేసి ప్రాజెక్టు ప్రారంభించిందన్నారు. నాయకులు మాత్రం పుష్కర ప్రాజెక్టులు, కాలేజీలు అన్నీ నేనే తెచ్చానని డప్పులు కొట్టుకుంటున్నారన్నారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, తాను ఎప్పుడు ప్రజాసంక్షేమాన్ని కోరుకుంటారని వారికి తెలుసని ఆయన చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, మారిశెట్టి భద్రం తదితరులున్నారు.

'రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే'

కొత్తపల్లి, జనవరి 6: రాష్ట్రంలో రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. కొత్తపల్లి పాత తహశీల్దార్ కార్యాలయం సమీపంలో జనసేన నాయకుడు గవర రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. మండలంలో 17 గ్రామాల జనసైనికుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో 3నెలల్లో రాష్ట్రంలో రాక్షస పాలను అంతమొందించి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందన్నారు. వార్డు స్థాయి నుంచి వైసీపీ అరాచకాలను ప్రజలకు తెలియజేసి జగన్‌ని గద్దె దింపాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. జనసైనికులు కొణమర్తి రాంబాబు, చోడిశెట్టి అప్పలరాజు, గుండ్ర రామకృష్ణ, పేపకాయల రాజు, సానా రమేష్, కొండపల్లి ప్రసాద్, వేగిశెట్టి సూర్యనికిల్, సానా ఆది ఎజ్జి వీరబాబు ఉన్నారు.

'టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ముందుకు'

తుని రూరల్, జనవరి 6: రానున్న టీడీపీ ప్రభుత్వం అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థిక స్వాలంబన పొంది అన్ని రంగాల్లో ముందుకెళతారని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో శనివారం కేవో మల్లవరం గ్రామంలో నిర్వహించిన మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో ఆమె పర్యటించారు. మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దింపి ప్రజా ప్రభుత్వం టీడీపీకి మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, టీడీపీ సీనియర్ నాయకుడు చిటికెల శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'జాబ్ క్యాలెండర్ ఊసే లేదు'

తుని రూరల్, జనవరి 6: జగన్ పాలనలో జనవరి నెలలు వచ్చి పోతున్నాయి కానీ జాబ్ క్యాలెండర్ ఊసే లేదని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ ధ్వజమెత్తారు. తుని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ వైఖరితో రోడ్డున పడ్డ యువత నిరుద్యోగ సమస్యతో సుమారుగా 20వేలు పైబడి ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఎన్నికల ముందు రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీకి హామీ ఇచ్చి గద్దె నెక్కిన తరువాత హామీని గాలికి వదిలేశారని చెప్పారు.

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

జగ్గంపేట, జనవరి 6: రామవరం గ్రామం సచివాలయం1పరిధిలో వలంటీర్, వీఆర్వో, సెక్రటరీల నిర్లక్ష్యం వల్ల పేద కుటుంబాలు ఇబ్బందులకు గురై నష్టపోతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మండల అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం నేత వీరాంజనేయులు మాట్లాడుతూ వలంటీర్, వీఆర్వో, సెక్రటరీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు విజృంభణ జిల్లా కార్యదర్శి కె.సతీష్, రైతు కూలీ సంఘం నాయకులు సురేష్, రంగవల్లి నగరం నాయకులు సోమరాజు, దుర్గ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల చదును పనులకు శ్రీకారం

గురజనాపల్లి (కరప), జనవరి 6: మండలంలోని గురజనాపల్లిలో శనివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించి ఇళ్ల స్థలాల చదును పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఆధీనంలోని 160 ఎకరాల సాల్ట్‌భూములను సేకరించి ఇళ్లస్థలాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ మెగా లేఅవుట్‌లో కాకినాడరూరల్, అర్బన్, కరప మండలానికి చెందిన 8వేల మందికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ అనుసూరి శ్రీనివాసరావు, పబ్బినీడి పాపారావు, చింతా ఈశ్వరరావు, త్రిపర్ణ ఆదిలక్ష్మి, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

33 మందిపై బైండోవర్ కేసులు

కరప, జనవరి 6: అక్రమ మద్యం, నాటు సారాయి కేసుల్లో నిందితులుగా ఉన్న 33మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్టు తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవాని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గతంలో మద్యం, సారాయి విక్రయాలు జరిపిన ఈ నిందితులను శనివారం కరప తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు ఆమె చెప్పారు. ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీ కుమార్ పాల్గొన్నారు. సంక్రాంతికి పురస్కరించుకుని గతంలో పేకాట, కోడిపందేలు ఆడిన 25మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

75 లీటర్ల సారాతో నలుగురి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 6: ప్రత్తిపాడులో సెబ్ అధికారులు ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం మండలాల్లో దాడులు నిర్వహించి 75 లీటర్ల సారాతో నలుగురిని అరెస్ట్ చేశారు. లంపకలోవలో పెంకే గాలీజును 20లీటర్ల సారాతో, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో బోరా నానిబాబు 15లీటర్ల సారాతో, సిరిపురంలో 15లీటర్ల సారాతో కోట వెంకన్నను, శంఖవరం మండలం శంఖవరంలో అంబటి అబ్బాయితో 25లీటర్లసారాతో అరెస్ట్ చేశారు. 4 సర్కిల్ పరిధిలో పాత సారా కేసుల్లో నిందితులను 31 మందిని తాజాగా బైండోవర్ కేసులు నమోదు చేసి ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం తహశీల్దార్ల వద్ద హాజరుపరిచారు. సెబ్ సీఐలు పి.అశోక్, కాకినాడ సీఐ బి.వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్ఐ జి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జున, దొరబాబు ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన

రౌతులపూడి, జనవరి 6: మండలంలోని గుమ్మరేగుల, రాజవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవ గాహన కల్పించారు. కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ హాజరై కేంద్రప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ పొయ్యిలను అందజేశారు. సర్పంచ్‌ల రాపర్తి రామ కృష్ణ, ఎంపీడీ వో గోవింద్, ఎంఈవో గాడి కొండబాబు, జానకి దేవి, పాపారావు, యాదగిరి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత

కాజులూరు, జనవరి 5: కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటూ ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బళ్ల నారాయణమూర్తి ఉపకార వేతనాలు అందిస్తున్నారు. దీంట్లో బాగంగా కళాశాల నుంచి ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470కి 462 మార్కులు సాధించిన కేతా వేణుకు, బైపీసీలో 440కి 383 మార్కులు సాధించిన డి.హేమలక్ష్మిలకు బళ్ళ నారాయణమూర్తి చేతులమీదుగా రూ.5000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు విళ్ళ భీమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

మలేపల్లిలో 'బాబు ష్యూరిటీ'

గండేపల్లి, జనవరి 6: మలేపల్లిలో శనివారం గ్రామ టీడీపీ అధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సలార్, డెవిల్ బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	కపాలదీవి
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	పిండం
పద్మప్రియ	:	యానిమల్
సత్యగౌరి	:	పిండం
సూర్య 1	:	డెవిల్
సూర్య 2	:	సలార్

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

పెదపూడి, జనవరి 6: ప్రతి ఒక్కరూ శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని తహశీల్దార్ టీ.సుభాష్, ఎస్ఐ. పీ.శోభన్ కుమార్ అన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగడానికి తీసుకునే చర్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ » వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



గండేపల్లి : టీడీపీలో చేరినవారితో నెహ్రూ

గండేపల్లి, జనవరి 6: రాబోయే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సుబ్బయమ్మపేట గ్రామంలో మాజీ సర్పంచ్ గొల్లవిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ఏడుగురు వార్డుమెంబర్లు 50 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో టీడీపీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. వార్డు మెంబర్లు టి.వరలక్ష్మి, దాసరి రామతులసి, గొల్లవిల్లి సత్తిబాబు, జెర్రిపోతుల నాగ ప్రసన్న, ముమ్మన శ్రీను, బొండా అప్పలరాజు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండ లాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, కొత్తకొండబాబు, దాపర్తి సీతారామయ్య, బొండా శ్రీనుబాబు, గొల్లవిల్లి రాజు ఉన్నారు.

మూలపేటలో...

కొత్తపల్లి: రాష్ట్రంలో మత్స్యకారులకు పూర్తి స్థాయి సహాయసహకారాలు అందించి ఆదుకుంది కేవలం టీడీపీ ప్రభుత్వంలోనేనని అది గుర్తెరిగి తమ పార్టీకి పార్టీలోకి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేరడం అభినందనీయమని అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని మూలపేట గ్రామంలో సుమారు 100 మంది వైసీపీకి చెందినవారు టీడీపీలో చేరగా వారికి వర్మ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. పార్టీలోకి చేరినవారిలో కంబాల నూకరాజు, రాంబాబు, నేరుగ గంగరాజు, పంచాయతీ సభ్యులు పెనుగు ఏసేపు, మెరుగు రాజు, మైనంపల్లి తాతీలు తదితరులున్నారు. ఆయనశెట్టి సత్యానందరెడ్డి, కంబాల రమణ, మెరుగు సూరిబాబు, ఉప్పాక అప్పారావు, నాగు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మండపంలో...

శంఖవరం: మండలంలో మండపం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు భారీగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నేత పోలం చిన్నా ఆధ్వర్యంలో వైసీపీ ముఖ్యనేతలు తాటికొండ సత్తిబాబు, తాటికొండ వెంకటసూరి, తాటికొండ సురేష్, వేల్పుల బుజ్జి, తాటికొండ బాబులు, చాగంటి ఆనదంరావు టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా శివ, నియోజకవర్గ యువత అధ్య క్షుడు కీర్తి వెంకటసుభాష్, బద్ది రమణ, కర్రి శివగణేష్, సరమర్ల మధు, గ్రామ నాయకులు పోలం విష్ణు, ఊటుకూరి బాబులు, అర్జున్, నక్కా నాగేశ్వరావు ఉన్నారు.



శంఖవరం : టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ



గొల్లప్రోలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉరితాళ్లు బిగించుకుని నిరసన

గొల్లప్రోలు, జనవరి 6: డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పారిశుధ్య కార్మికులు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలులో 11రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ మొండివైఖరితో విసిగిపోయిన వారు ఉరితాళ్లు బిగించుకుని తమకు ఆత్మహత్యలు మినహా శరణ్యం లేదని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏపీ మునిసిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నందీశ్వరరావు, ఏసమ్మ, పార్వతి, సీహెచ్‌వీ రమణ, రామారావు, సత్యవతి, లోవ, బంగారు రాము, ఎన్.సత్తిబాబు తదితరులున్నారు.

ఎంపీటీసీ, సర్పంచ్ మధ్య వాగ్వాదం



గ్రామసభలో ప్రశ్నించుకుంటున్న సర్పంచ్, ఎంపీటీసీ

తాళ్లరేవు, జనవరి 6: సుంకరపాలెం హెల్త్‌క్లినిక్ నిర్మాణంపై వైసీపీ ఎంపీటీసీ గుత్తుల శ్రీను, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు మధ్య వాగ్వాదం జరిగింది. శనివారం సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీటీసీ హెల్త్‌క్లినిక్ నిర్మాణానికి రూ.2.40 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని గొయ్యితీసి వదిలేశారని, నిధులను తిరిగి వెనక్కి ఇస్తే వేరే వాళ్లతో నిర్మాణం చేపడతామని సర్పంచ్ అనడంతో ఎంపీటీసీ, సర్పంచ్ మధ్య వాగ్వాదం ఏర్పడింది. అడ్వాన్సు తీసుకుని రెండేళ్లయినా నిర్మాణం గొయ్యిలానే ఉండడంతో పిల్లలు పడిపోయే ప్రమాదం ఉందని, దీనికి ఎవరు బాధ్యులని వారిద్దరు ప్రశ్నించుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధను వివరణ కోరగా ఎంపీటీసీ తీసుకున్న అడ్వాన్స్‌ను వెనుకకు తిరిగి ఇస్తానన్నారని, త్వరలోనే హెల్త్‌క్లినిక్ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు.

లలిత, విష్ణు సహస్ర పారాయణం

జగ్గంపేట, జనవరి 6: స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి, తనయుడు అనీష్ నెహ్రూ ఆధ్వర్యంలో లలిత, విష్ణు నామ సహస్ర పారాయణం, మణిదీప్ప వర్ణన నిర్వహించారు. జగ్గంపేట ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. జ్యోతుల మణి, తోట సునీత, కొత్త కొండబాబు, జీను మణిబాబు, జంపన రవివర్మ, బుర్రి సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ బొండా సాయి లక్ష్మిసత్యవతి, జిల్లా ఆర్యవైశ్య మహిళ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు కొత్త లక్ష్మిసాయి, ఆర్యవైశ్య సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ బొండా చైతన్య పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారిణి మృతి

పెద్దాపురం, జనవరి 6: స్థానిక గౌరీ కోనేరుకు చెందిన బుర్రకథ కళాకారిణి కనకం లక్ష్మీ (70) శనివారం మృతి చెందారు. ఆమె గత 40ఏళ్లుగా బుర్రకథతో పాటు పలు కళారూపాల్లో ప్రధాన కథకురాలిగా భర్త సూరిబాబుతో కలిసి పలు ప్రదర్శనలిచ్చారు. ఆమె మృతికి ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, డి.సత్యనారాయణ, మహాపాత్రిన రాంబాబు, గరగపాటి పెంటయ్య, కుంచే అచ్చారావు, కేదారి నాగు, మంతెన సత్తిబాబు సత్యనారాయణ, వర్మ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

డిగ్రీ కళాశాలకు నేక్ 'ఏ' గ్రేడ్

తుని రూరల్, జనవరి 6: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనబంధ సంస్థ స్పేసెస్ (శ్రీ ప్రకాష్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, సైన్సెస్) డిగ్రీ కళాశాలకు నేక్ నేషన్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ 'ఏ' గ్రేడ్ లభించిందని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు తెలిపారు. కళాశాల సిబ్బంది,విద్యార్థులను అభినందించారు.

ఇంటి హక్కు పట్టాల పంపిణీ



కాకినాడరూరల్, జనవరి 6: రూరల్ మండలం కొవ్వూరు గ్రామపంచాయతీ పరిధిలోని తారకరామానగర్‌లోని లబ్ధిదారులకు శాశ్వత ఇంటి హక్కు పట్టాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం పంపిణీచేసారు. కొవ్వూరు ఉపసర్పంచ్ పబ్బినీడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గోపిశెట్టి పద్మజాబాబ్జీ, తహశీల్దార్లు మురార్జీ, సీతాపతి పాల్గొన్నారు.

తొండంగి ఎస్ఐగా వినయ్ ప్రతాప్

తొండంగి, జనవరి 6: తొండంగి ఎస్ఐగా వినయ్ ప్రతాప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్రావు వీఆర్‌కు వెళ్లడంతో గొల్లప్రోలు ఎస్ఐగా ఉన్న వినయ్‌ప్రతాప్ బదిలీపై తొండంగి వచ్చారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేపట్టాలి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



గొల్లప్రోలులో ధర్నా నిర్వహిస్తున్న వర్మ

గొల్లప్రోలు, జనవరి 6: ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులు తక్షణం చేపట్టాలంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారులపై ప్రదర్శన జరిపి గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పనులపై వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. వరద ముంపు నుంచి శాశ్వత రక్షణతో పాటు సాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు తెలుగుదేశం పార్టీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు రూ.156కోట్లు మంజూరు చేసి టెండర్లు ఖరారు చేసి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. పనులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఎంపీ, ఎమ్మెల్యేలు పనులు అవసరం లేదంటూ లేఖ ఇచ్చి రద్దు చేయించారన్నారు. టీడీపీ హయాంలో చేపట్టి 70శాతంపైగా పూర్తి చేసిన ఏలేరు ఫేజ్-1 పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని తెలిపారు. గొల్లప్రోలులో జరిగిన కాపు నేస్తం సభలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు కొత్తగా నిధులు ఇస్తున్నట్లు ఆర్భాటంగా సీఎం జగన్ ప్రకటించారని గుర్తుచేశారు. ఇది జరిగి ఏడాదిన్నర గడిచినా ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వలేదని, కనీసం టెండర్లు పిలవలేదని ఎద్దేవా చేశారు. రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందించే ఉద్దేశ్యంతో రూ.1650కోట్లుతో చేపట్టిన పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. తహశీల్దారు వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు



ప్రత్తిపాడులో ఒంటికాలుపై నిలబడి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

తాళ్లరేవు, జనవరి 6: న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను బెదిరింపులకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరిని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కె.శ్రీనివాస్ ఖండించారు. శనివారం తాళ్లరేవులో నిరసన శిబిరం వద్ద వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం జీవో నెం.2ను వెనక్కి తీసుకుని అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు సమ్మెలో శనివారం ఒంటికాలుపై నిలబడి ప్రభుత్వ తీరుకు నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. కె.సత్య అచ్చిరాజు, మరియ, ధనలక్ష్మి పాల్గొనగా ఆందోళనకు సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వర్రావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, జనార్ధన్ మద్దతు తెలిపారు.

కరప: డిమాండ్ల పరిష్కారం కోరుతూ కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు చేపడుతున్న నిరసన దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి ఆందోళన చేశారు. పి.వీరవేణి, ఎం.భవానీ, బి. అచ్చారత్నం, ఆర్.దైవకుమారి, ఎస్.వరలక్ష్మి ఉన్నారు.

తుని రూరల్: తుని అర్బన్, రూరల్ అంగన్‌వాడీలు, హెల్పర్లు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో నెంబరు2ను తీసుకొచ్చి అంగన్‌వాడీలు భయభ్రాంతులకు గురిచేసే కుట్రకు ప్రభుత్వం తెరతీసిందని మండిపడ్డారు.

సామర్లకోట: ప్రభుత్వం తమపై ఎస్మా చట్టం అమలుచేసేందుకు కుట్రపూరితమైన జీవోను విడుదల చేసినప్పటికీ ప్రభుత్వం దిగివచ్చేవరకూ తాము వెనకంజ వేసేదేలేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సామర్లకోట ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. సామర్లకోట మండలం, పట్టణంలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరుకుంది.

శృంగారవల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం, జనవరి 6: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,04,390, అన్నదాన విరాళాలు రూ.50,345 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.3,720 వెరసి రూ.1,58,455 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. శృంగారవల్లభస్వామి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆలయంలో ఆయన భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్ టికెట్లు, రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ గవరసాన సూరిబాబు, దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, గోపు మురళి, కుంచే అమరావతి, దేవస్థానం ఈవో పులి నారా యణమూర్తి, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల పక్షాన జనసేన పార్టీ'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 6: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగిస్తూ జనసేన పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ అన్నారు. శనివారం రామకృష్ణారావుపేటలో మీకోసం జనసేన పేరుతో ఇంటింటి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంలో దారుణాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రాబోయే ఎన్నికలలో జనసేన, టీడీపీ కూటమికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, డివిజన్ నాయకులు డాక్టర్‌బాబు, కసుమూర్ కాన్, జడరాజు, మొహినుద్దీన్ పాల్గొన్నారు.

భవిష్యత్తుకు హామీ...

భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు హామీ యాత్ర కార్యక్రమాన్ని కరణంగారి సెంటర్ ప్రాంతంలో అగ్రహారం సతీష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని భవన నిర్మాణ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో జనసేన, టీడీపీ కూటమిలో మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని పొందుపరుస్తారని భరోసాఇచ్చారు. కార్యక్రమంలో నగేష్, రాజు, చక్కారావు, రవీంద్ర పాల్గొన్నారు.

'బీసీలను ఆదరించిన టీడీపీ'

సర్పవరం జంక్షన్, జనవరి 5: రాష్ట్రంలో బీసీలను ఆదరించిన పార్టీ తెలుగుదేశం అని, బీసీలంతా చంద్రబాబుతోనే ఉంటారని టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కాకినాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టిందే బడుగు, బలహీన వర్గాల నుంచి అన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బీసీల సంక్షేమం, అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. బీసీలకు సబ్ ప్లాన్ నిధులు కేటాయించి, ఆదరణ వంటి పథకాన్ని అమలు చేశారన్నారు. శాసన సభాపతి, శాసనమండలి ఉపసభాపతిగా అనేక పదవులు ఇచ్చి ప్రోత్సహించారన్నారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా ప్రతీ నియోజకవర్గం పరిధిలోని మండలంలో సమావేశాలు ఏర్పాటు చేసి బీసీలకు టీడీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాజకీయ అవకాశాలు, రిజర్వేషన్లపై అవగాహన కల్పిస్తామన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

గండేపల్లి, జనవరి 6: మండలంలో మురారి గ్రామం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న చిన వెంకటేష్, కె.దుర్గ మురారి గ్రామం వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో దుర్గకు తలకు గాయమైంది. పోలీసులు బాధితులను ఆసుపత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.

22న రామరాజ్య శోభాయాత్ర

పిఠాపురం, జనవరి 6: అయోధ్య రాముల వారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రం నుంచి ఈనెల 22వ మధ్యాహ్నం 3గంటలకు రామరాజ్య శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ప్రముఖ్ వెంకటేశ్వరరావు తెలిపారు. శోభాయాత్రలో పిల్లలు, పెద్దలు, యువతీ, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని హిందువుల ఐక్యతను చాటాలని కోరారు. అయోధ్య శ్రీరాముల వారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గడపగడపకు రాముల వారి అక్షింతల వితరణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో లక్ష్మణశర్మ, కర్నీడి తాతీలు, శ్రీనివాసులు, రాము, కొండేపూడి శివ, దడాల నాని, చిత్రాడ సుబ్రహ్మణ్యం తదితరులుపాల్గొన్నారు

తుని రూరల్: ఇంటింటా అయోధ్యరాముని అక్షింతలు పంపిణీ తేటగుంటలో జరిగింది. రామ మందిరం వద్ద ప్రత్యేక పూజలు అనంతరం అక్షింతలతో శోభయాత్ర నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు, అక్షింతలను అందజేశారు.

9న పొగాకుపై అవగాహన

అన్నవరం, జనవరి 6: జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న అన్నవరం దేవస్థానంలో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, కమిషన్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులకు పొగాకు, వాటి ఉత్పత్తుల వినియోగ నియంత్రణపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 11గంటలకు వార్షిక కల్యాణవేదిక ఎదురుగా ఉన్న ప్రాంగణంలో కార్యక్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

10న తునిలో చంద్రబాబు సభ

తుని రూరల్, జనవరి 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఈ నెల 10న తునిలో చేపడుతున్న భారీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని తుని ఇన్‌చార్జి యనమల దివ్య కోరారు. రాష్ట్రం, ప్రజల కోసం జరుగుతున్న ఈ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

మహాసంస్థానంలో హుండీ లెక్కింపు

పిఠాపురం, జనవరి 6: పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శనివారం హుండీని లెక్కించారు. సెప్టెంబరు 25 నుంచి ఇప్పటి వరకూ 16,73,265 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు ఫణీంద్రకుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, ఈవోలు ఆర్.సౌజన్య, డి.శ్రీనివాసరావు, ధర్మకర్తలు పైండా శ్రీరామమూర్తి, చక్కా శ్రీదత్త చలపతి, నల్లాడ సూర్యప్రసాద్, మీసాల విజయలక్ష్మి, గోసి రమణమ్మ తదితరులు ఉన్నారు.

క్విజ్ పోటీల్లో లక్ష్మీదుర్గ ప్రతిభ

కాజులూరు, జనవరి 6: భారతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో కాజులూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన కొప్పిశెట్టి లక్ష్మీదుర్గ ప్రతిభ కనబరిచి మెరిట్ సర్టిఫికెట్ సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పంపన కృష్ణమూర్తి, బీఐఎస్ మెంటర్ చింతా నారాయణమూర్తి, గ్రామ ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు అభినందించారు.

'ప్రభుత్వ రాయితీలు అందించాలి'

తాళ్లరేవు, జనవరి 6: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వ రాయితీలను అందించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని గీత కార్మికసంఘం అధ్యక్షుడు దున్నా అంబేడ్కర్ కోరారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఆయన మాట్లాడుతూ పోలేకుర్రు, నీలపల్లి, పి.మల్లవరం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వ రాయితీలను అందింపజేసేలా కృషి చేయాలన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 6: ప్రత్తిపాడులో పేద విద్యార్థులు, వారి తల్లులకు సదా మీ సేవలో స్వచ్ఛంద సేవా సంస్థ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పౌష్టికాహార కిట్లతో పాటు విద్యార్థులకు రెడీమేట్ దుస్తులు, తల్లులకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక షీర్డి సాయి జ్యూయలర్స్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన వీటిని బజార్ వీధి రామాలయం వద్ద రెడ్డి, గీతావాణి దంపతులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి వి.కామరాజు, మండల ఫోటోగ్రాఫర్ల, టైలర్ల సంఘ నాయకులు సలాది కృష్ణ, ఏలూరి వెంకటరమణ, సంస్థ సభ్యులు జి.సత్యానందం, బి.రాంబాబు, ఎస్వీ సోమేశ్వరరావు, జగదీశ్వరి, సి.లక్ష్మి, జి.లక్ష్మి ఉన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత

ప్రత్తిపాడు, జనవరి 6: ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య 5411 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు సిడగం వెంకటేశ్వరరావు, కొరాడ ప్రసాద్, హుస్సేన్, సుంకర సుబ్బారావు, తొండారపు రాంబాబు, కమిషనర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు షీల్డ్‌లు

అన్నవరం, జనవరి 6: గ్రామంలో గత 10రోజులుగా అన్నవరం ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో విజేతలకు శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా కప్, షీల్డ్, మెమెంటోలు అందజేశారు. ట్రోఫీలను స్పాన్సర్ పసుపులేటి చక్రధర్‌ను అభినందించారు. టీడీపీ నాయకులు సరమర్ల మదుబాబు, మెరపల నరసయ్య, బండారు సురేష్, పిల్లి ప్రసాద్, కర్రి లోవదొర ఉన్నారు.

వీఆర్వో సంఘ అధ్యక్షుడిగా పద్మశేఖర్

గొల్లప్రోలు రూరల్, జనవరి 6: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గొల్లప్రోలు మండలాధ్యక్షుడిగా పెదిరెడ్ల పద్మశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా కోరుమిల్లి నూకరాజు, కార్యదర్శిగా మామిడి అనంతలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా బి.బేబీ సౌమ్య, కోశాధికారిగా వై.మాణిక్యాలరావు, జాయింట్ ట్రెజరర్‌గా యామన సత్తిబాబు, గౌరవాధ్యక్షుడిగా మారే సురేష్‌కుమార్‌లు ఎన్నికయినట్లు ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం

రౌతులపూడి, జనవరి 6: గ్రామంలో మార్కెట్ సెంటర్ నందు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.